REGD. NO. A. 18


విడి ప్రతి 0-20 న. పై

శుక్రవారం 25-8-61

జమీన్‌రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 33 ★ సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ★ సంచిక 34




ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికలసంఘం నియమించిన పరిశీలకులు వివిధజిల్లాలలో పర్యటిస్తున్నారు, పర్యటించబోతున్నారని వార్త.

# హైదరాబాదు లేఖ

## ★ ఆంధ్రప్రదేశ్ చేనేతసంస్థల రగడ వివరాలను పంపమని ముఖ్యమంత్రిని ప్రధాని కోరారట!

## ★ ఆంధ్రరాజధానిలో గానాబజానా మచ్చను, ఆడపురుషుల బెడద తొలగించడం అవసరం

## ★ మన శాసనసభలో మంత్రులుచేసే వాగ్దానాలు అధికం, చెల్లేవాగ్దానాలు స్వల్పం.

రాష్ట్రి లఘుపరిశ్రమలమంత్రి వ్యవహారం, ప్రధాని నెహ్రూ మేజామీదికెక్కినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలియవస్తున్నది. ఇటీవలజరిగిన ఆంధ్రి అసెంబ్లీలో సమావేశంలో రచ్చకెక్కిన చేనేతపరిశ్రమ వ్యవహారం, సహకారవ్యవస్థకేగాక, కాంగ్రెసుకు కూడా కళంకదాయకంగా పరిణమించే ప్రమాదం ఉన్నదనే ప్రాథమిక అభిప్రాయం శ్రీ నెహ్రూకు ఏర్పడినట్లున్నది. ఈ వ్యవహారమునకు సంబంధించిన అన్ని కాగితాలు, పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి, ఒక నివేదిక సమర్పించవలసిందిగా ఆంధ్రి ముఖ్యమంత్రిని శ్రీ నెహ్రూ కోరినట్లుకూడా తెలియవచ్చింది. ఈ మాసారంభంలో రాష్ట్రి ముఖ్యమంత్రుల సమావేశం ఢిల్లీలో జరిగినపుడు, యీ విషయాన్ని ముఖ్యమంత్రి సంజీవయ్యతో ప్రస్తావించి, యీ వ్యవహారానికి సంబంధించిన యావత్తు వివరాలను పంపవలసిందిగాకూడా ప్రధాని కోరారట.

ఢిల్లీనుంచి తిరిగి రావడంతోనే పత్రికా విలేఖరులు "మంత్రి లక్ష్మణ్ పోర్టుఫోలియో మార్పువదంతులు"గురించి ప్రశ్నించగా, "సమయం వచ్చినపుడు" చెబుతా ననడంలో యేదో నిగూఢార్థం ఉన్నదని ఊహించినవారి ఊహ కల్లగాదని యిటీవల వినివస్తున్న వార్తలవల్ల తెలుస్తున్నది.

ఈ శుక్రవారం, మంత్రి లక్ష్మణ్‌పై అసెంబ్లీలో ఆరోపణలుచేసిన శ్రీ ప్రగడ కోటయ్యగారు హైదరాబాదు వస్తున్నారు. ఆయన రాకను పురస్కరించుకొని, ఆరోపక, ప్రత్యారోపకులైన లక్ష్మణ్, కోటయ్యగార లిరువురిమధ్య సమాధానకు కొంత ప్రయత్నం జరుపుతారని వినికిడి.

ఇటీవల కొంతకాలంగా ముఖ్యమంత్రికి మంత్రి లక్ష్మణ్, ఆయనను నడిపించే ఒకానొక ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి గారలిరువురు, తెలంగాణాలో ఆత్మీయులు కాక పోయినా, సన్నిహితులయ్యారు. వారిమధ్య అప్యాయత ఒక మోతాదు ఎక్కువే కనిపిస్తుంది.

వెనుకబడిన తరగతుల చుట్టరికం ఒక్కటే గాక, తెలంగాణాలో కె.వి. పాత్ర అనిశ్చితం కావటం; ఇతరులంతా ఘర్షింటువారు కావటం; మంత్రి రామచంద్రారెడ్డిలో చౌరవ చాకచక్యం ఆశించినంతగా కనిపించకపోవటం... యివన్నీ యీమాత్ర అప్యాయతకు కారణములై యుండవచ్చును. ఆంధ్రికు సంబంధించి మొదటనుంచి కోటయ్యగారు సంజీవయ్య అనుచరుడు; సహచరుడు. ఈ విధంగా ఆంధ్రి ప్రదేశ్‌లోని ఇరుపార్శ్వాలకు చెందిన భుజస్కంధాల తగాదాను సర్దుబాటు చేయడానికి ముఖ్యమంత్రి ప్రయత్నించడంలో తప్పులేదు. అదీగాక యీ ఇరువురేగాకుండా, యీరగడకంతకు మూలపురుషుడైన మాదాని సోమప్ప తనవాడు; సోమప్ప మనిషియే కాను. ఈ విధంగా "తనవారి" మధ్య బయలుదేరిన యీ రగడను సర్దుబాటుచేయడానికి ముఖ్యమంత్రి ప్రయత్నించకపోతే, మరెవరినివదలుకోనేట్లు?

ఐతే ముఖ్యమంత్రి సర్దుబాటు చెయ్యడం అనేది యెంతవరకు నిలుస్తుంది అనేది తేలే ప్రశ్న. పదిమందిలోపడ్డ వ్యవహారాన్ని ప్రజల కళ్లకు గంతకప్పి దాచియుంచటం సాధ్యమా? కమ్యూనిస్టులు యీ చేనేత సంఘాల వ్యవహారమును క్షుణ్ణంగా పరిశీలించేందుకు శాసనసభా ఉపసంఘాన్ని నియమించాలని కమ్యూనిస్టులు ముందే బయలుదేరారు. వ్యవహారం రచ్చకు వచ్చేదాకా "లాలూచీబేరం" గానీ బజారు కెక్కినతర్వాత 'బహిరంగ వ్యాపారమే' నంటూ, పార్టీ చాకచక్యపు ఎత్తుగడ లన్నింటినీ ప్రయోగించి, ముగ్గురు చేనేత నాయకులను, బజారుకులాగి బోను ఎక్కించారు. స్వతంత్ర పార్టీకూడా వెల్లగా బయటపడింది. యీ వ్యవహారం అంతా 'న్యాయ విచారణ' జరిపించాలని ఆచార్యరంగా సూచించారు.

ఈ విధంగా గుప్తంగా, ఇంటిగుట్టులాగా సర్దుకుందామనుకొన్నా సర్దుకోవటానికివీలులేని వాతావరణం ఏర్పడింది. ఎన్నికలకు ముందు యిలాంటి వాతావరణం కాంగ్రెస్ ప్రతిష్టకు భంగకరమని ప్రధాని నెహ్రూ చింతిస్తున్నారు.

అటు పట్టరీత్యా చర్యకాకుండా, యిటు ప్రతిపక్షాలు ప్రశ్నలు ఆరోపించడానికి వీలు లేకుండా, 'విషయపరిశీలనం' అనే పేరుతో చేనేత వ్యవహారాలన్నింటిని, వాటికిసంబంధించిన యావత్తు రికార్డును క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఒక ఉన్నతాధికారిని నియమించవలసిందిగా ప్రధాని నెహ్రూ రాష్ట్రిముఖ్యమంత్రికి సూచించే అవకాశం లేకపోలేదు.

ఈ పరిశీలనఅంతా జరిగేలోగా మంత్రి లక్ష్మణ్‌ను బర్తరఫ్ చేయటం సంభవం కాకపోవచ్చును. అవిధమైన సూచన ముఖ్యమంత్రివద్దనుంచిగానీ, ముఖ్యమంత్రి వ్యతిరేకులనుంచిగానీ బయటకు రాకపోవడమే దీనికి కారణం. అట్లుగాక ప్రగడ కోటయ్య గట్టిగా పట్టుబట్టి ముఖ్యమంత్రిమీద ఒత్తిడి తేగల్గితే మంత్రి లక్ష్మణ్ బర్తరఫ్లా అసాధ్యం కాదు; పోర్టుఫోలియో మార్పు చిటికెలమీద పనే. ఐతే యీ రాజకీయ చదరంగంలో శ్రీ కోటయ్యగారు యెంత చాతుర్యంగా నడుస్తారో 24 తేది తేలుతుంది.

### జాంబీవాడలో సత్యాగ్రహం

ఆంధ్రిప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం కెదురుగా మహనీయుడు మహబూబ్ పేర వెలసే మహబూబ్ కా మెహిందీ, విజయవాడలోని సాంబమూర్తి రోడ్డువలె, జాంబీవాడ అయిపోయింది.



పంజాబీసుబా కొరకు పదిరోజుల నుండి ప్రాయోపవేశం చేస్తున్న 76 ఏండ్ల శిక్కునాయకుడు మాస్టర్ తారాసింగ్.

వ్యభిచార నిరోధక చట్టాన్ని పోలీసులు యెంత కఠినంగా అమలుజరిపినా, ఆవాడలో కారత్వం తగ్గకపోగా, ఆరోజాకారోజు స్థిరపడిపోతూవున్నది. రాజధాని నగరంలో న్యాయస్థానం కండ్లముందు ఇలాంటి "సామాజిక మచ్చలు" సహించదగనివని బుద్ధిమంతులైన పదిమందీ కూడబలుక్కొని, సర్వజన సంఘంగా ఏర్పడి, వ్యభిచార నిరోధక సత్యాగ్రహాన్ని ఆగస్టు 15 శుభముహూర్తాన ఆరంభించారు. వారి సత్యాగ్రహం "విటుల తగటిరాక"ను ఆపిచేయగల్గిందే గాని నిశాచరమును నివారింపగలదా?

అదీగాక ఈ సత్యాగ్రహంతో మెహిందీ బజారునుంచి రంగస్థలం నగరం నాలుగు మూలలకూ అల్లుకుపోతున్నది. ఏయింట్లో వారిస్త్రీ ఉన్నదో, ఎక్కడ లేదో పోలీసులు

—కొరవ 12-వ పేజీలో.

.... నిర్మల ....

**కాఫీపొడి - కాఫీగింజలు**

| | | |
|---|---|---|
| స్పెషల్ కాఫీపొడి | 400 గ్రాములు | రూ. 3—25 |
| ప్లాంటేషన్ కాఫీపొడి "A" | 400 గ్రాములు | 3—00 |
| హొటలు కాఫీపొడి | 400 గ్రాములు | 2—75 |

ప్యాకింగు : 400; 200; 100; 50 గ్రాములలో దొరకును.


| | | |
|---|---|---|
| నీలగిరి గుండు కాఫీగింజలు | 1 కిలో | రూ. 5—40 |
| " "A" బద్ద " | 1 కిలో | 5—10 |
| రొబస్టా గుండు కాఫీగింజలు | 1 కిలో | 3—90 |

పై ధరలపైన సేల్సుటాక్సులేదు - వ్యాపారస్తులకు మంచికమీషను.

గ్రాము : నిర్మల ఫోను : 280

నిర్మల కాఫీ వర్క్సు

ట్రంకురోడ్డు—నెల్లూరు




# జర్మనీ సమస్య-

## అంతాకలిసి జర్మనీని రెండుముక్కలుగా వుంచి జయభేరి మ్రోగిస్తారు- జర్మన్ల ఏకజర్మనీవాంఛ ప్రగాఢమౌతుంది- దాని పర్యవసానం ఏమవుతుందో?

జర్మనీ సమస్య చివరకు 'తునితగవు' కావలసిందేనా? మన ప్రధాని అందులో ప్రవేశిస్తారంటే ఆశాజ్యోతి వెలిగెను; ప్రవేశించవద్దనిరని అంతా ఆశాభంగం చెందినారని తెలిసింది; తిరిగి [illegible] కల్పించుకొనేవరికి 'రెడ్డొచ్చె మొదలెత్తుమో' ఐనది.

జర్మనీని విభజించివుంచేపద్ధతిని ఆమోదించడానికి జర్మన్లు సిద్ధపడివుంటే, తూర్పు–పడమరల 'యుద్ధం' జర్మనీలో ఇంత హోరాహోరీగా జరగవలసి లేకుండెను. జర్మన్ అన్న పురుషుడుగానీ, స్త్రీగానీ పడమటిసీమనగానీ, తూర్పు సీమనగానీ వాంఛించినదొకటే: ఏకజర్మనీ.

అందువలన, అంతర్జాతీయ పర్యవేక్షణపై జరిగిన ఎన్నికలలో రాగల ఏకజర్మనీ ప్రభుత్వాన్ని అంగీకరించడానికి పాశ్చాత్యులు, రష్యన్లు ఒకసమయంలో ఒడంబడిరి. ఆ పట్టుగొమ్మను పీకకుండా పాశ్చాత్యులు త్వరపడి కథనడిపించివుంటే ఎర్రటి జర్మనీ ఎక్కడా వుండేదిగాదు. ఎర్రటి జర్మన్‌పక్షం పార్లమెంటులో ప్రతిపక్షంలో ప్రతిపక్షంగా మాత్రమే వుండేది.

యూరప్‌లో (ప. యూరప్‌లో) ఒక్క తూర్పుజర్మనీ ముక్కలోనే ఎర్రటిపాలన సాధ్యమైనది. ఇటలీ, ఫ్రాన్సు, స్పెయిన్, పోర్చుగల్ సీమలు ప. యూరప్‌లో బలహీనమైనవి. వాటిలో ఎర్రటిపాలన రాకుండా చూడాలనగాని తూర్పుజర్మనీలో ఎర్రటిపాలన ప్రతిష్ఠాపకమైవుంటే దాని వ్యాప్తికి మార్గం కొంచెంసుగమమైనట్లుంటుంది. అందువల్ల, శాశ్వతంగా, ఎర్రటిముక్క ఎక్కడా ప. యూరప్‌లో వుండరాదని పాశ్చాత్యుల పట్టుదల. దీనితోడు, తమ ప. యూరప్ ముక్క చక్కగా ప్రదర్శించకంలేదని తెలిసి, తమకు ప్రత్యామ్నాయంగా మంచి అవకాశాలు ఇతరమైనవి లభించేటట్లుంటే, ఆ ముక్కను వదలుటకు దానికి రష్యన్లు సిద్ధపడినారు.

ఆ నాటికింకా అణ్వస్త్రాలలో, అంతరిక్షయానాలలో రష్యాకింత ఆధిక్యత లేకుండెను; ఇంతటి ఆధిక్యత తమకు లభించగలదని ఎర్రటివారు ఆనాడు బహుశా ఆపేక్షించలేదు.

ఆ సమయంలో జర్మనీ సమస్యను పరిష్కరించవలసివుండెను. అప్పుడు తూర్పు–పడమర లందున జర్మన్‌ప్రజ తమదేశం తిరిగి ఏకం కావడానికై అమితోత్సాహాన్ని చూపెను. ఒకానొకదశలో ఇటు పాశ్చాత్యులను, అటు రష్యన్లను అవతలకునెట్టివేసి జర్మన్లంతా ఒకటై ఏకజర్మనీ ప్రతిష్ఠాపనకు పూనుకోవలెననే తలంపు ఆ సీమలో కలిగింది. ఆ తరుణాన్ని జారవిడచి, పాశ్చాత్యులు దెబ్బతిన్నారు.

ప్రస్తుతం ఉభయపక్షాలకూ జర్మనీలో మిగిలింది ప్రతిష్ఠ. తూర్పు జర్మనీ ఆర్థికంగా నలిగినది; దానినిచూపి కమ్యూనిజమంటే ఎట్లా వుంటుందో చూడండి అని చెప్పేవీలులేదు. కమ్యూనిస్టుద్యమవ్యాప్తికి అది పెద్ద దెబ్బ. ప. జర్మనీ భాగ్యసీమ. పోయిగా బ్రతకదలచినవారు తూర్పునుంచి పడమటికి వస్తున్నారు. ప. జర్మనీ గట్టిగా బలపడింది; ఇంకా బలపడుతుంది; బలపడితే, ఆ బలంపు ఉత్తరోత్తర జర్మనీకి లాభంగాని ఇతరులకు కాకపోవచ్చును. ఈ భయం లేకపోలేదు. కాని, వారుగానీ, వీరుగానీ తమ, తమ జర్మనీ ముక్కలను వదలుకోవడానికి సిద్ధంగాలేరు. దానిని కాపాడడం తమ ధర్మమట. దీనిని కాపాడడం వీరి ధర్మమట. లోకరక్షణ ప్రశస్తులైన ఆ యీ లోకోద్ధారకుల హస్తంబున మించి ఆ ముక్కలు బ్రతకగలవా, వర్ధిల్లగలవా?

మమ్మల్నడిగితే జర్మన్లను స్వేచ్ఛగా వదిలే సమయం రాలేదు. ఆ మధ్యజరిగిన యూదు వ్యతిరేకత ప్రదర్శనలెంత వ్యాప్తంగా, ఎంత భీకరంగా వుండినవో లోకం పరిశీలించింది. ప. జర్మనీలో స్వేచ్ఛవుండేనుగనక ఇది బయటపడింది. తూర్పున స్వేచ్ఛలేదుగనక అది తెలియలేదు. సాధారణ ప్రజకు నాజీతత్వం హానికరమని జర్మనీలో తెలిసివచ్చిందా అని సంశయం కలుగుతున్నది.

నాజీలు ఎర్రటివారిని బోలినవారు, స్వేచ్ఛవుంటే, దానిని వినియోగించుకొని, పిదప నిచ్చెనను క్రిందకుత్రోసి, తమపాలనను సంస్థాపన చేసెదరు. స్వేచ్ఛలేనిచోట, అణగివుండి, రహస్యంగా కుట్రకల్పెదరు. నాజీలకు, ఎర్రటివారికి స్వేచ్ఛనువ్వడమా ఇవ్వక

—కొరవ 10-వ పేజీలో.



రెండవ అమెరికా అంతరిక్ష యాత్రికుడు గ్రిస్సోమ్

# 1980 నాటి మాట!

**** పరిశీలకుడు ****

ఇరవై ఏండ్లలో, అంటే 1980 నాటికి, రష్యా సోషలిజంనుండి పరిపూర్ణమైన కమ్యూనిజం గమ్యాన్ని చేరుకోగలదని ప్రధాని క్రుషోవ్ ప్రకటించారు. కమ్యూనిజంలో రష్యన్ పౌరులు పొందగల లాభాలనుగూడా వివరించారు. ఆ వాగ్దాన పూర్వాపరాలను గూర్చిన పరిశీలనే ఈ రచన. అందులోని మొదటిభాగం ఈవారం యిస్తున్నాము.

—సం. జ. రై.

ఈ రెండు దశాబ్దాలకాలం మనమంతా బ్రతికి బాగుంటే, అందరం 'సోషలిజం' ఛత్రఛాయలోకే వస్తామని రష్యానియంత అపేక్షిస్తున్నారు. ఆయన సోషలిజం అంటే ఎర్రటి కమ్యూనిజం. లోకమంతా దానికి లొంగితే మంచిదని ప్రాజ్ఞులంతా భావించడంలేదు. అందువలన, ప్రపంచాన్ని ఆదిశకు తీసుకపోయే ప్రయత్నం సఫలమవుతుందంటే, భయమేగాని ఆనందం కలగదు.

అందుకనే జయప్రకాశ్ నారాయణవంటి ప్రజాహిత తత్పరుడు, లోకకల్యాణ కంకణబద్ధుడు, దేశభక్తాగ్రేసరుడు, సర్వోదయ నాయకుడు 'నాదేశానికట్టి పర్యవసానం వద్దు బాబూ, నీ పుణ్యమూ యని' అని సర్వప్రపంచ నిర్ణేతగా సిద్ధమైన రష్యానియంత నుద్దేశించి పలికెను.

ఎంతమంచి వస్తువైనా 'ఇదేమంచిది' అని ఎవరిచేతనైనా వర్ణింపబడితే, దాని మంచితనం సమ్మతం గావడంకంటె ఆక్షేపించబడడం ఎక్కువ సంభవం. ఆ వస్తువు అంతమంచిదనే భావం సర్వత్రా లేనపుడు—కాగా, అది మానవాళికి మత్తు అనే అభిప్రాయం అనేకంగా వెల్లడిఅవుతూవుండగా, అదే లోకానికి కావలసింది, అదే సిద్ధమై ఈ కరుటుంది అని గంభీరోక్తులు గావించడం లోకానికి హితకరమా, అది మహా విశేషమా?

◆ ◆ ◆

రష్యన్లు, అమెరికన్లు తమ, తమ మార్గాల వెంబడి తమ ప్రజలను సిరిసంపదలతో తుల

—కొరవ 11-వ పేజీలో

అమ్మోనియా ఫాస్ఫేటు

(అమ్మో ఫాస్)

కేరళ ప్రభుత్వ ఫ్యాక్టరీలో తయారైన అమ్మోనియా ఫాస్ఫేటు (అమ్మో ఫాస్) మావద్ద దొరకును. స్టాకు పరిమితంగావున్నది.

రైతులు త్వరపడవలెను

**** మరియు మావద్ద ****

ఎముకలపిండి-ఎముకలజివ-సూపర్ ఫాస్ఫేటు

ప్యారీ మిక్చర్లు

అన్నిపైర్ల తెగుళ్లు, చీడపురుగులకు మందులు

వాటిని వుపయోగించుటకు స్ప్రేయర్లు — డస్టర్లు దొరకును

ఆంధ్ర బోన్ మిల్లు కంపెనీ,

స్టోన్‌హవుస్‌పేట (రేవులవారివీధి) నెల్లూరు

(ఫోన్ :: 67)

# ఎలక్షన్ సన్నాహాలు

## * లక్నో అఖిలపక్ష సదస్సు నిర్ణయాలు
## * బొంబాయినగరంనుండే కృష్ణమీనన్ పోటీ
## * ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెస్ దరఖాస్తులు

• లక్నో అఖిలపక్ష సదస్సు

లక్నోలో యీ వారం జరిగిన అఖిలపక్ష సదస్సు, రాజకీయపార్టీలు అనుసరించ వలసిన కొన్ని సాంప్రదాయాలపై ఒక అంగీకారానికి రావడం హర్షదాయకమైన విషయం. రానున్న జనరల్ ఎన్నికలదృష్ట్యా, లక్నో సదస్సు నిర్ణయాలు అత్యంత ప్రాముఖ్యం వహిస్తాయి.

ఈ సదస్సులో, కాంగ్రెసు, ప్రజాసోషలిస్టు, కమ్యూనిస్టు, సోషలిస్టు, స్వతంత్ర పార్టీల, జనసంఘం నాయకులు పాల్గొని, రాజకీయపార్టీల ప్రవర్తనను నిర్దేశించే ప్రకటనపై సంతకాలుకూడ చేశారు.

దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలపరచడానికి, రాజకీయ వాతావరణాన్ని పరిశుద్ధం చేయడానికి అవసరమైన ప్రవర్తన నిబంధనగా వలసిన అన్నిపార్టీలు అనుసరించాలని సదస్సు అభిప్రాయపడింది. ఈ సదస్సు అంగీకరించిన అంశాలివి:

ఎన్నికల ప్రచారోద్యమ సందర్భంలో చేసే విమర్శలు, కేవలం రాజకీయ పార్టీల విధానాలు, సిద్ధాంతాలు, కార్యక్రమాలకు మాత్రమే పరిమితమై వుండాలి. పార్టీ కార్యకర్తల, నాయకుల రాజకీయజీవితానికి సంబంధంలేని వ్యక్తిగత విషయాలను గురించిన విమర్శలను విసర్జించడంకూడ అవసరం. అబద్ధాలను ఆధారంగా చేసుకొనిగాని, వాస్తవాన్ని వక్రంగా చిత్రిస్తూగాని రాజకీయపార్టీలను, వాటి కార్యకర్తలను విమర్శించరాదు. పరస్పర విద్వేషాలనూ, వివిధకులాలకూ-మతాలకూ చెందినవారిమధ్య ఉద్రిక్తతనూ రెచ్చగొట్టే కార్యకలాపాలను ఏపార్టీ చేపట్టరాదు. రాజకీయపార్టీలు ఎదుటివారి సభలను, సమావేశాలను, ఊరేగింపులను భగ్నంచేయరాదు. ఒక అభ్యర్థి ఏఎన్నికలోనైనా ఒకానొక రాజకీయపార్టీ టిక్కెట్టుకు పెట్టుకున్న దరఖాస్తును ఆపార్టీ నిరాకరించినప్పుడు, యితర రాజకీయ పార్టీలు, ఆ అభ్యర్థికి అదే ఎన్నికలో టిక్కెట్టు యివ్వడానికి పూనుకోరాదని అన్ని పార్టీలు అంగీకరించాయి.

రానున్న ఎన్నికలదృష్ట్యా పై కడపటి అంశం విశేష ప్రాధాన్యం వహిస్తుంది. ఈ ఒప్పందం అమలుజరిగితే రాజకీయ కల్మషాన్ని తొలగించడానికి అవకాశం ఏర్పడవచ్చు.

### పాటిల్, మీనన్ల సెలక్షన్

బొంబయి ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికల సంఘం, దక్షిణబొంబయి నియోజక వర్గానికి కేంద్ర ఆహారశాఖామంత్రి శ్రీ యస్. కె. పాటిల్ గారిని, ఉత్తర బొంబయి నియోజక వర్గానికి, కేంద్రరక్షణ శాఖామాత్యులు శ్రీ కృష్ణమీనన్‌ను సెలక్టుచేశారు. ప్రస్తుతం వీరువురు, పైనియోజక వర్గాలలో సభ్యులుగా వుంటున్నారు.

దక్షిణ బొంబయి నియోజకవర్గంలో శ్రీ పాటిల్ ఒక్కరే దరఖాస్తు చేశారు. ఉత్తర నియోజకవర్గంలో, శ్రీ బాబురావ్ దిశాయ్, శ్రీ ఇంద్రవదన్ ఓజా గారలుకూడ కాంగ్రెస్ టిక్కెట్లకు దరఖాస్తులు చేశారు. శ్రీ దిశాయ్ తనదరఖాస్తును ఉపసంహరించుకోగా, ఓజా దరఖాస్తును ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల సంఘం త్రోసిపేసింది.

శ్రీ మీనన్ పోటీ చాల ప్రాధాన్యం వహించేట్లున్నది. ప్రజాసోషలిస్టుపార్టీ, స్వతంత్రపార్టీ, జనసంఘం వగైరా పార్టీలన్నీ, మీనన్‌కు పోటీగా ఆచార్య కృపలానీని పోటీకినిలబెట్టాలని ప్రయత్నంచేస్తున్నట్లున్నది. ఇదే వాస్తవమైతే, వీరిరువురుమధ్య పార్లమెంటులో కొనసాగుతున్న యుద్ధం, నియోజకవర్గంవరకు వెడుతుందన్నమాట!

### ఆంధ్రప్రదేశ్‌లో సన్నాహాలు

ఆంధ్రప్రదేశ్ మొత్తంమీద ఎన్నికల సన్నాహాలు జోరుగాసాగుతున్నవి. ఈ నెలాఖరుకుగాని లేదా సెప్టెంబరు మొదటివారానికి కాంగ్రెసు టికెట్‌కోసం దరఖాస్తులు పెట్టిన అభ్యర్థుల అర్హతలనుగురించి, ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికల సంఘానికి నివేదించగలందులకు, ప్రదేశ్ కాంగ్రెసు పరిశీలకులు, వివిధ జిల్లాలను యీవారం పర్యటిస్తున్నారు. కొన్ని జిల్లాలను వచ్చేవారం పర్యటించనున్నారు.

రాష్ట్ర శాసనసభలోని 254 స్థానాలకు

—కొరవ 10-వ పేజీలో.

## ఆంధ్ర కాంగ్రెస్‌లో జమీన్‌దారీవర్గం

"ఆంధ్రలోని ఒక ముఖ్యుడైన రాజు తన సహచరులైన జమీందారులను కాంగ్రెస్‌కు దరఖాస్తులు వేయవలసిందిగా ప్రోత్సహిస్తున్నారు. వారికోర్కెను ఇప్పటికి బొబ్బిలి, పిఠాపురం, కురుపాం, చల్లపల్లి, విజయనగరం, గద్వాల్, తుని, పాపన్నపేట, నాసపూరు, దోమకుండ, వనపర్తి జమీందార్లు మన్నించారు. రాబోవు శాసనసభలో అరవైమందిగల ఒక జమీందారీవర్గాన్ని సృష్టించడమే వీరి సంకల్పం."

(—'లింక్' పత్రికనుండి)

# ఇతర జిల్లాలు

### చిత్తూరు కళాశాల ప్రారంభోత్సవం

చిత్తూరు పిభుత్వఆర్ట్సు అండ్ సైన్సు కళాశాలను, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్యగారు గత 18 తేది ప్రారంభోత్సవం చేశారు. నాటి ప్రారంభోత్సవసభకు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సిలర్ డాక్టర్ గోవిందరాజులు నాయుడుగారు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ అనుకున్న సమయంలో కళాశాలను ఏర్పాటుచేయుటకు, కృషిచేసిన కళాశాల సంఘాన్ని అభినందించారు. చిత్తూరులో వలెనే, కర్నూలుజిల్లాలోని ఆదోనిలో ఒక కళాశాలను స్థాపించేందుకు తగినఏర్పాట్లు జరుగుతున్నట్లు చెప్పారు.

ఈ సభలో పి. డబ్లు. డి. మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు మాట్లాడుతూ పూర్వకాలంలో గుడ్లు, గోపురాలు, సత్రాలు కట్టేందుకు సంపన్నులు దానంచేసేవారని, యిప్పుడు కాలగతినిబట్టి విద్యాసంస్థలు నెలకొల్పేందుకు దాతలు ముందుకురావాలన్నారు.

తమ చిరకాల వాంఛితమైన కళాశాల నెలకొల్పబడినందుకు చిత్తూరు పౌరులు బ్రహ్మానందము పొందారు.

### తిరుపతి వార్తలు

శ్రీ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం సెప్టెంబరు 13 నుండి 21 వరకు జరుగుతుంది. నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 10 నుండి 18 వరకు జరుగుతాయి.

• • •

—కొరవ 9-వ పేజీలో.